

బొబ్బిలి వీణకు మరో విశిష్ట గుర్తింపు

- ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి కార్యక్రమం కింద ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న కళాకారులు
- నేడు ఢిల్లీలో అవార్డు అందుకోనున్న కలెక్టర్ అంబేడ్కర్



బొబ్బిలి/విజయనగరం కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి)

అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రాచుర్యం పొందిన బొబ్బిలి వీణకు మరో విశిష్ట గుర్తింపు లభించింది. వన్ డిస్ట్రిక్ట్- వన్ ప్రొడక్టు (ఓడీఓపీ) కింద ఎంపికైంది. రాష్ట్రానికి చెందిన ఏడు జిల్లాల ఉత్పత్తులు ఎంపిక కాగా అందులో మన బొబ్బిలికి చెందిన నమూనా వీణ (గిఫ్ట్ వీణ) ఉండడం విశేషం. ఈ పురస్కారాన్ని అందుకునేందుకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. కొత్తఢిల్లీలోని ప్రగి మైదానంలో భారత్ మండపంలో సోమవారం జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ఓడీఓపీ అవార్డును అందుకోనున్నారు.

బొబ్బిలి రాజుల సంస్థానంలో వీణల తయారీ కళాకారులను అమితంగా ప్రోత్సహించేవారు. ఆనాడే వీణల తయారీకి పునాది పడింది. తర్వాత రోజుల్లో దేశవిదేశాల్లో ఈ వీణ కొలువుదీరింది. ఇప్పటికీ విదేశస్థులు సైతం కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఎన్ఆర్ఐల ఇళ్లలోనూ బొబ్బిలి వీణ కనిపిస్తుంది. అమెరికా అధ్యక్షునిగా పనిచేసిన బిల్‌క్లింటన్ మదిని సైతం ఈ వీణ గెలుచుకుంది. వీణల తయారీ కళాకారులు వైట్‌హౌస్ (శ్వేతభవానికి)కు రావాలని క్లింటన్ అప్పట్లో ఆహ్వానించిన సంగతి తెలిసిందే. సాంప్రదాయ సరస్వతి వీణగా పిలిచే బొబ్బిలి వీణ సప్తస్వరాలను పలికించడంలో ప్రత్యేకతను చాటుకుంది. సరస్వతీ వీణలను గిఫ్ట్‌వీణలుగా తయారు చేసి ప్రభుత్వ పరంగా అతిథులకు ఇవ్వడం ఆనవాయితీగా మారింది. టీటీడీ కార్యక్రమాలు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరిగే అంతర్జాతీయ స్థాయి సమావేశాలు, సదస్సుల్లో బొబ్బిలి వీణ(గిఫ్ట్ వీణ)లను అందజేస్తున్నారు.



బొబ్బిలి వీణల తయారీలో కళాకారులు

- తపాలా శాఖ తమ స్వర్ణోత్సవాల్లో భాగంగా బొబ్బిలి వీణ బొమ్మలతో తపాళాబిళ్లలు (మిగతా 8వ పేజీలో..)





శాకంబరి దేవిగా కనకమహాలక్ష్మి అమ్మవారు

శాకంబరిగా అమ్మవార్లు

చీపురుపల్లి/ శృంగవరపు కోట రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకొని చీపురుపల్లి పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో ఆదివారం అలంకరించారు. అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో బి.శ్రీనివాస్, కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, అర్చకులు ఆరవిల్లి రవికుమార్, భవాని శంకర్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎస్.కోట మండలంలో ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా ప్రఖ్యాతిగాంచిన కొట్టాం కోటమ్మ తల్లికి కూడా ఆదివారం ఆలయ ఈవో శ్రీనువాసరావు ఆధ్వర్యంలో శాకంబరి అలంకారం చేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



శాకంబరిగా కొట్టాం కోటమ్మతల్లి

కోట శ్రీనివాసరావు మృతితో

అభిమానుల దిగ్భ్రాంతి

- షూటింగ్ కోసం జిల్లాకు ఒకసారి రాక



విజయనగరం/రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి):

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిసి జిల్లాలోని ఆయన అభిమానులు దిగ్భ్రాంతి చెందారు. వందల సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలతో అలరించిన ఆయన ఇక లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. నాటకరంగం, సినిమా రంగం రెండింటిలోనూ పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న కోట శ్రీనివాసరావుకు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. 1990 నుంచి 2000, 2000 నుంచి 2015 వరకూ ఒక విధంగా కోట శ్రీనివాసరావు యుగం అని చెప్పాలి. ఆయన లేని సినిమాయే లేదు. విభిన్న పాత్రల్లో తనదైన శైలిలో ఒదిగిపోయి నవ్వుల్లోనూ, కన్నీళ్లల్లోనూ ప్రేక్షకులను ఆకట్టుకున్న గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. 1978లో ప్రాణం ఖరీదు సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు. 750 పైగా సినిమాల్లో నటించిన ఆయన 9 నంది అవార్డులు పొందారు.

1993లో విజయనగరం రాక


నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటించిన 'బొబ్బిలి సింహం' సినిమా షూటింగ్ విజయనగరం, కోరుకొండ, కోరుకొండపాలెం (మిగతా 8వ పేజీలో..)

ప్రగతి లేని పైలెట్ గ్రామాలు

7లో

- గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- పూడికపోయిన కాలువలు
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

29 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవే



గ్రీన్‌ఫీల్డ్ హైవే నమూనా చిత్రం

- నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఆనందంలో తీర ప్రాంత ప్రజలు

భోగాపురం, జూలై13(ఆంధ్రజ్యోతి): జిల్లా తీరం వెంబడి భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో సుమారు 29 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవే రానుంది. ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు చొరవతో కేంద్రం కోస్టల్ హైవేకు సూత్రప్రాయంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో తీరం వెంబడి ఆరు లైన్లుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే రానుంది. దీంతో జిల్లాలో సముద్ర తీర ప్రాంతంతో పాటు తీరం వెంబడి ఉన్న 21 గ్రామాలు అభివృద్ధి కానున్నాయి.

ఉత్తరాంధ్రకు కీలకమైన గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ నేషనల్ హైవే శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం మూలపేట పోర్టు నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు మీదుగా విశాఖ జిల్లా భీమిలి వరకు నిర్మించాలని ముఖ్యమంత్రి (మిగతా 8వ పేజీలో..)



హైవే రానున్న ముక్కాం సముద్ర తీరం



పాఠశాలలకు తాళం పడకూడదు

ఆప్షనల్ హాలీడేస్ పేరిట పాఠశాలలకు తాళాలు పడకూడదన్న ప్రభుత్వ తాజా నిర్ణయాన్ని అనుసరించాల్సిందే. ఆప్షనల్ హాలీడేస్‌ను ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా ఉపయోగించుకోవాలే తప్ప మూకుమ్మడిగా సెలవు పెట్టే విధానానికి స్వస్తి పలకాలి. అవసరమైన ఉపాధ్యాయులు మాత్రమే ఆప్షనల్ హాలీడేస్‌ను వ్యక్తిగతంగా వాడుకోవాలి. ఒక పాఠశాలలో ఒకేరోజు 50 శాతానికి మించి ఆప్షనల్ హాలీడే వాడకూడదు.

- మాణిక్యంనాయుడు, డీఈవో, విజయనగరం

షరతులతో 'ఆప్షన్'

- ఉపాధ్యాయుల వ్యక్తిగత సెలవులకు నిర్దేశం
- ఏ రోజూ పాఠశాలలు మూతపడకూడదని సూచన

రాజాం రూరల్, జులై 13(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో దిద్దుబాటు చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా ఉపాధ్యాయుల ఆప్షనల్ హాలీడేస్ వినియోగంపై విద్యాశాఖ కమిషనర్ విజయరామరావు మార్పులు చేశారు. ఆప్షనల్ హాలీడేస్ కారణంగా పాఠశాలలకు తాళాలు పడకూడదని నిర్దేశించారు. ఆ మేరకు అనుసరించాల్సిన విధి విధానాలను ప్రకటించారు. విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలకు 5 ఆప్షనల్ హాలీడేస్ ఉంటాయి. ఇటీవల కాలం వరకూ వీటిని ఉపాధ్యాయులు తమకు అవసరమైనప్పుడు, పండుగల సమయాలలో ఉపయోగించుకునేవారు. ఫలితంగా ఆరోజు పాఠశా లకు తాళాలు పడేవి. అయితే విద్యాశాఖ కమిషనర్ ఆప్షనల్ హాలీడేస్ వినియోగంపై కొత్తమెలిక పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లో స్కూల్స్ బంద్ కాకూడదని, అవసరమైతే ఆయా రోజుల్లో పాఠశాలల్లో పనిచేసేవారిలో 50 శాతం మంది ఉపాధ్యాయులే ఆప్షనల్ హాలీడే పెట్టుకోవాలని ఆంక్షలు విధించారు.

కొడుకుతో వెళుతూ.. కానరాని లోకాలకు

7

- గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి గడువు పొడిగింపు

7

బిల్లులు కాక.. పనులు సాగక

- వేగావతి నది దాటేందుకు తప్పని అగచాట్లు
- భోజరాజపురం వంతెన వద్ద పరిస్థితిదీ

8

పొగాకు ఉత్పత్తులు అక్కడ విక్రయిస్తే చర్యలు: ఎస్పీ

విజయనగరం క్రైం, జూలై 13(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో విద్యా సంస్థల సమీపంలోని పాన్‌షాపుల్లో తనిఖీలకు ఆదేశించారు. ఐదు రోజులుగా చేపట్టిన తనిఖీల్లో 512 కేసులు నమోదు చేశారు. విద్యా సంస్థలకు సమీపంలో వంద మీటర్ల పరిధిలో పాన్‌షాపులు, కిరణాషాపులు, సిగరెట్లు.. నిషేధిత ఖైనీ గుట్కాలు.. మత్తు కలిగించే ఇతర పొగాకు వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పేర్కొన్నారు. ఇటువంటి ఉత్పత్తులను విక్రయించడం వల్ల విద్యార్థులు వీటికి అలవాటు పడి వక్రమార్గంలో ప్రయాణించే ప్రమాదం ఉందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వీటిని విక్రయించకుండా చర్యలు చేపట్టామన్నారు. వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఆదివారం నాటి ప్రత్యేక డ్రైవ్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నగరం.. జలమయం

- భారీ వర్షానికి మునిగిన లోతట్టు ప్రాంతాలు

విజయనగరం/రూరల్/గజపతినగరం, జూలై13(ఆంధ్రజ్యోతి): విజయనగరం పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో గంట పాటు దంచి కొట్టింది. దీంతో అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. మార్కెట్ వీధులు చెరువులను తలపించాయి. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడం, కొన్ని కాలనీల్లో ఇళ్లల్లోకి వర్షం నీరు వెళ్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా కొన్ని గంటల పాటు రోడ్లు మునిగి ఉండిపోయాయి. కొన్ని అపార్టుమెంటు సెల్లార్‌లలోకి కూడా వర్షం నీరు అధికంగా చేరింది. కాగా వరుణుడు కోసం ఎదురుచూసిన రైతన్నలు ఈ వర్షంతో ఊరట చెందారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు ఇప్పటికే వరి నారు తయారు చేసుకున్నారు. మరికొందరు యద జల్లుకున్నారు. రెండు రోజుల నుంచి వర్షాలు లేక కొన్ని చోట్ల నారు ఎండిపోయి కనిపించింది. నాట్లు ఓ పక్కకు ఒరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో వాన పడడంతో అన్నదాతలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు గజపతినగరం, మెంటాడ, బొండపల్లి, రాజాం, గంట్యాడ, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం తదితర ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది.



గజపతినగరం ప్రధాన రహదారిలో కురుస్తున్న వాన



విజయనగరం ప్రధాన మార్కెట్‌ను ముంచెత్తిన వర్షపు నీరు



అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అధికంగా చేరిన వాన నీరు

ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి గడువు పొడిగింపు

విజయనగరం దాసన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 20తేదీ రాత్రి 11.55 గంటల వరకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉందని చెప్పారు. రిజిస్ట్రేషన్ పూర్తి అయినవారు 22వ తేదీ ఒంటిగంట లోపు సమీపంలోని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలకు ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకెళ్లి వెరిఫికేషన్ పూర్తిచేసుకోవాలన్నారు. 23, 25 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐలకు, 26, 27 తేదీల్లో ప్రైవేటు ఐటీఐలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వివరాలకు 94415 18355, 98499 44654, 77806 58035 నెంబర్లను సంప్రాదించాలన్నారు.

రేపు పెన్షనర్ల ధర్నా

విజయనగరం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెన్షనర్ల సంఘం పిలుపుమేరకు ఈనెల 15న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి అప్పారావు, నారాయణ, సూర్యనారాయణ, నాయుడులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన ఎమెండ్‌మెంట్ రద్దు చేయాలని, పీఆర్ బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. ఈ ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం

విజయనగరం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉల్లివీధి కూడలిలో ఉన్న హజరత్ సయ్యద్ న్యామత్ ఖావలీ హౌలియా బాబా ఉరుసు మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. శాంతినగర్ నుంచి చందనోత్సవం ఊరేగింపు నిర్వహించారు. బాబా దర్గాలో విశేష ప్రార్థనలు నిర్వహించి, భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖాదరీ, సలాం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుపుల వితరణ

లక్కవరపుకోట, జూలై 13(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఉన్న విద్యార్థులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు వంద పరుపులు వితరణ చేశారు. రూ.లక్షా 30వేలు తమ సొంత నిధులను వెచ్చించి విద్యార్థులకు పరుపులు కొని అందించారు. ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో నేతృత్వంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, కొల్లు రమణమూర్తి, కొట్యాడ ఈశ్వరరావు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సభలు, ధర్నాలు నిషేధం

రేగిడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పోలీస్ సబ్ డివిజన్‌లో పోలీసు చట్టం సెక్షన్-30 అమలులో ఉన్నందున అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించరాదని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాలవారు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.


రేపు 'జాతీయాలు- సామెతలు' పుస్తకావిష్కరణ

విజయనగరం కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఈనెల 15న సాయంత్రం 6 గంటలకు జాతీయ కవి గరిమెళ్ల సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని గరిమెళ్ల సత్యనారాయణ, కవిత జాతీయాలు-సామెతలు పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నట్టు అభ్యుదయ రచయితల సంఘం ఉపాధ్యక్షుడు జైపాల్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా జీఎస్ చలం, గీతాలాపన డప్పు శ్రీను, పుస్తకావిష్కరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు సవరమ్మ చేస్తారని పేర్కొన్నారు. అదే విధంగా వల్లూరి శివప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. రచయితలు, కవులు, సాహితీవేత్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ బదిలీ

విజయనగరం క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.శ్రీనివాస్‌ను శనివారం రాత్రి వీఆర్‌కు బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈయన వన్‌టౌన్ సీఐగా ఏడాదిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టుబడ్డ కేసు నమోదులో జాప్యం జరిగిన నేపథ్యంలో ఆకస్మిక బదిలీ చేశారు. ఈయన స్థానంలో విజయనగరం స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్‌వీఆర్‌కే చౌదరిని వన్‌టౌన్ సీఐగా నియమిస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు జారీ చేశారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణా నక్షత్ర సందర్భంగా శ్రీనివాసుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పి.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించి, అనంతరం హోమం నిర్వహించారు.

ప్రగతి లేని పైలెట్ గ్రామాలు

- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- పూడుకుపోయిన కాలువలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

గజపతినగరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ గ్రామం చూసినా అధ్వానంగా దర్శనమిస్తోంది. కాలువలన్నీ పూడుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఎక్కడ వ్యాధుల బారిన పడతామేమోనని గ్రామీణులు భయాందోళన చెందుతున్నారు. బహిరంగ మలవిసర్జనపై ఎటువంటి చర్యలు లేవు. పలుచోట్ల చెత్త సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా నిలిచాయి. మండలంలోని 30 పంచాయతీలు ఉండగా.. అందులో గజపతినగరం, పురిటిపెంట, పాతబగ్గాం మరుపల్లి, గుడివాడ, సీతారామపురం, కొత్తశ్రీరంగరాజపురం, దావాలపేట, పిడిశీల, సాలిపేట గ్రామాలను పారిశుధ్య మెరుగు కోసం పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి డంపింగ్ యార్డులకు తరలించాల్సి



కెంగువ కాలువలో పేరుకుపోయిన చెత్త

ఉంది. ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టి, ఆయా ఫోటోలను గ్రామ కార్యదర్శులు యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగు పడడం లేదని మండలవాసులు గగ్గోలు పెడుతున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన



కొత్తశ్రీరంగరాజపురం మురుగునీరు ఇలా..

గ్రామాల్లోనే పారిశుధ్య పనులు లోపిస్తే మిగిలిన గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో అధికారులకే తెలియాలి.

చర్యలు చేపడతాం

గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపడుతున్నాం. గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణ లోపిస్తే చర్యలు తీసుకుంటాం. చెత్తసంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని ఇప్పటికే సూచించాం. పారిశుధ్య పనులు లోపించిన గ్రామాల్లో పర్యవేక్షణ చేపడతాం.

- సుగుణాకరరావు, ఈవోపీఆర్డీ, గజపతినగరం

కిత్తన్నపేటను అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే లలితకుమారి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీకి కంచుకోటలా నిలిచిన కిత్తన్నపేట గ్రామంలో ఎమ్మెల్యే లలితకుమారి ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి వివరించారు. కిత్తన్నపేట గ్రామం టీడీపీకి కంచుకోటగా నిలిచి ప్రతి ఎన్నికలో భారీ మెజారిటీ ఇస్తోందని అన్నారు. గ్రామస్థులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, చొక్కాకుల మల్లునాయుడు, కొట్యాడ ఈశ్వరరావు, దుక్క వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'తొలి అడుగు'

- ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజులు పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాలపై కరపత్రాల ద్వారా ప్రచార సభల ద్వారా వివరిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారన్నా



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

రు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వాటిని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు, ముద్దాడ చంద్రశేఖర్, పైడిరాజు, భరత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే జనసేన లక్ష్యం

- నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజల శ్రేయస్సే జనసేన పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. పూసపాటిరేగ మండలం సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన పలువురు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు మెంబరు జి.శ్రీనుతో సహా పలువురు జనసేనలో చేరిన వారిలో ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

క్రియాశీలకంగా పని చేయాలి



మాట్లాడుతున్న జనసేన పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో జనసైనికులు క్రియాశీలకంగా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో ఉన్న వారంతా నిరంతరం పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలన్నారు. గ్రామ పంచాయతీకి ముగ్గురు క్రియాశీలక సభ్యులు, ఒక వీర మహిళ వివరాలను పార్టీ కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ గుర్ల మండల అధ్యక్షుడు యడ్ల సంతోష్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ధర్మాన్ని పాటిద్దాం

లక్కవరపుకోట, జూలై 13(ఆంధ్రజ్యోతి): జనసేన విస్తృత స్థాయి సమావేశం ఎల్‌కోట మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరై భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. కూటమి ధర్మాన్ని పాటించి అందరూ ముందుకు వెళ్లాలని ఆయన కార్య కర్తలకు దిశా నిర్దేశం చేశారు. అందరికీ అం దుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ నాయకులు రావాడ నాయుడు, పులిబంటి సంతోష్, శివాజీ, నాగేష్ పాల్గొన్నారు.

కంచరాంలో మట్టి వివాదం

రాజాం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కంచరాం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డుపై బత్తిన రాము అనే వ్యక్తి మట్టి వేయడంతో విద్యార్థులు, గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజుల కిందట ఈ మట్టిని తొలగించాలని ఆయన్ని ఓ వ్యక్తి అడగగా.. మట్టిని తీయను ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకో అని మొండిగా సమాధానం ఇచ్చాడు. దీంతో వివాదం తలెత్తింది. సర్పంచ్ ప్రతినిధి గెడ్డాపు అప్పలనాయుడు, గ్రామ పెద్దలు అక్కడకు చేరుకుని మట్టిని తొలగించాలని కోరారు. దీంతో రాము కొంత సమయం కావాలని కోరాడు. అందుకు గ్రామ పెద్దలు అంగీకరించారు. అయితే ఇచ్చిన గడువు దాటిపోయినా మట్టిని తొలగించలేదు. దీంతో ఎంపీడీవో



సిమెంట్ రోడ్డుపై మట్టి వేసిన దృశ్యం

వి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎం.రాజశేఖర్‌కు కూడా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకుని, రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీ వాసులు కోరుతున్నారు.

నగరంలో జీఆర్‌టీ జ్యూయలర్స్ ప్రారంభం

విజయనగరం రింగురోడ్డు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీ రోడ్డు డాబా తోట వద్ద ఆదివారం జీఆర్‌టీ జ్యూయలరీ షాపును ఘనంగా ప్రారంభించారు. సంస్థ చైర్మన్ జి.రాజేంద్రన్ ముఖ్య అతిథిగా హాజరై ఈ షాపును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1964లో తమ జీఆర్‌టీ పేరున బంగారం వ్యాపారాన్ని ప్రారంభించామని, నేటికీ విజయనగరంలో 66వ షోరూం ప్రారంభించామని చెప్పారు. ఈ షోరూంలో బంగారం, వజ్రం, ప్లాటినం, వెండితో రత్న ఆభరణాలు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. నాణ్యత, కళాత్మకత ప్రతిబింబించేలా షోరూంలో వస్తువులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రారంభ ఆఫర్‌లో గ్రాముకు రూ.150 తగ్గింపు, పాత బంగారు నాణాన్ని మార్పు చేసుకునే వినియోగదారులకు గ్రాముకు అదనంగా రూ.100 ప్రయోజనం కల్పిస్తున్నామన్నారు. వజ్ర ఆభరణాలపై క్యారెట్ విలువపై రూ.12,500 తగ్గింపు అందిస్తున్నామని, వెండి ఆభరణాలు ఎంఆర్‌పీపై పది శాతం డిస్కౌంట్‌ను అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జీఆర్‌టీ జ్యూయలర్



విజయనగరంలో జీఆర్‌టీ షోరూం

ఎండీ జీఆర్ ఆనంద్, ఆనంత పద్మనాభన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కొండలు కరిగిపోతున్నాయి

- కంకర అక్రమంగా తరలించుకుపోతున్న వైనం

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న చిన్న చిన్న కొండలను కొంతమంది అక్రమార్కులు పిండిచేసి, కంకరను తరలించుకుపోతున్నారు. మండలంలోని రావాడ, లింగాలవలస, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలోని కొండలను రాత్రి సమయాల్లో యంత్రాలతో దొలిచేసి, మట్టితో కూడిన కంకరను తరలించుకుపోతున్నారు. వీటి



రావాడ సమీపంలో అక్రమ తవ్వకాలకు గురైన కొండ

పరిమాణం రోజురోజుకు తగ్గిపోతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు.

వేంకటేశ్వరస్వామికి అభిషేకం

విజయనగరం కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుప్పాడలో వెలసిన శ్రీక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

విజయవాడ కనకదుర్గమ్మకు ఆషాఢం సారె

పూసపాటిరేగ, జూలై 13(ఆంధ్రజ్యోతి): అఖిలాంధ్ర భవానీ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిఏటా ఆషాఢ మాసంలో విజయవాడ కనకదుర్గ అమ్మవారికి సారెను అందజేయటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఉత్తరాంధ్ర భవానీలు, గురుభవానీలు ఆదివారం విజయవాడలో కనకదుర్గ అమ్మవారికి సారెను అందజేశారు. ఉత్తరాంధ్రకు చెందిన వీరు సుమారు 10బస్సులలో వెళ్లి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను ఆ సేవా సంఘం అధ్యక్షుడు ముప్పిడి నారాయణరావు ఆధ్వర్యంలో సమర్పించారు. అక్కడి దేవదాయ సిబ్బంది వారిని సంప్రదాయబద్ధంగా ఆహ్వానించి సారెను అమ్మవారికి అప్పగించే విధంగా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం



సారె తీసుకువెళ్తున్న భవానీ దీక్షా సమితి సభ్యులు, భక్తులు

లో సేవా సంఘ సభ్యులు తిప్పాన సూరప్పడు, బొజ్జ విజయ్‌కుమార్, సంకాబత్తుల లక్ష్మణరావు, బర్రి చిన్నరావు, భక్తులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు..

శృంగవరపుకోట రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం బొడ్డవర గ్రామానికి చెందిన వాసవీక్లబ్ ఆర్యవైశ్య మహిళలు వాసవీమాతకు సారె సమర్పించారు. సంఘ అధ్యక్షురాలు పూసర్ల కోటిరత్నం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. అలాగే గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు.



వాసవీమాతకు సారె సమర్పిస్తున్న మహిళలు

కొడుకుతో వెళుతూ.. కానరాని లోకాలకు

- గుర్తుతెలియని వాహనం ఢీకొని తండ్రి మృతి



ధర్మారావు (ఫైల్)

సాలూరు రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): కొడుకుతో పొలానికి స్కూటీపై వెళ్లిన తండ్రి.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన సాలూరు గొర్లెవీధిలో ఆదివారం చోటుచేసుకుంది. సాలూరు రూరల్ హెచ్‌సీ బంగారాజు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు పట్టణం గొర్లె వీధికి చెందిన గొర్లె ధర్మారావు(43)కు సాలూరు బైపాస్ రోడ్డులో పొలం ఉంది. ఆదివారం ఆయన తన కొడుకు గుణశేఖర్(14)ను వెంట బెట్టుకుని స్కూటీపై పొలానికి వెళ్లారు. అక్కడ నుంచి తండ్రీ కొడుకులు బైపాస్ రోడ్డుపై జీగిరాం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో స్కూటీని వెనుక నుంచి ఓ గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ ఎగిరి పడ్డారు. స్కూటీని ఆ వాహనం కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో ధర్మారావు తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడక్కడే మృతిచెందారు. గుణశేఖర్ గాయపడటంతో అతడిని తొలుత సాలూరు ఏరియా ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరంలో ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అలివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

గూడ్స్ ఢీకొని వృద్ధుడి మృతి

దత్తిరాజేరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): గూడ్స్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాచిపెంటకు చెందిన దాసరి తవిటయ్య(70) మండలంలోని మరడాం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా డౌన్‌లైను నుంచి వస్తున్న గూడ్స్ ఢీకొంది. దీంతో ఆయనకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ..

జామి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ-కంటకపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఈ విషయంపై రైల్వే పోలీసులు ఆదివారం మాట్లాడుతూ మృతురాలు 40 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి, ఐదు అడుగుల పొడుగు ఉంటుందన్నారు. ఎరుపురంగు చాయతో ఉండి, ఆకుపచ్చ, ఆరంజ్ రంగులతో కూడిన నైటీ ధరించి ఉందని చెప్పారు. తెలిసినవారు 9490617089, 9182073593 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బుచ్చెంపేటలో కొట్లాట

- పదిమందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

రాజాం రూరల్, జులై 13 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో పదిమంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఇద్దరు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరో ఐదుగురు రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాల మధ్య స్థలం విషయంలో ఆదివారం ఉదయం వివాదం చెలరేగింది. రాత్రి వరకూ పెద్దల సమక్షంలో చర్చలు జరిగాయి. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇరువర్గాలు కొట్లాటకు దిగారు. పిట్టా రాము, సత్యం, ముద్దన సూరిబాబు, పిట్టా రాజేంద్ర తదితరులంతా గాయపడిన వారిలో ఉన్నారు. రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బుచ్చెంపేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రైల్వే స్టేషన్ కోరుకొండ రైల్వేస్టేషన్ సమీపంలోని జొన్నవలస రైల్వేగేటు వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు జీఆర్‌పీ హెచ్‌సీ కృష్ణారావు ఆదివారం తెలిపారు. మృతుని వయస్సు 25 నుంచి 30 మధ్యలో ఉండొచ్చని చెప్పారు. మృతదేహం ఒంటిపై ముదురు నీలం రంగు నైట్ ప్యాంటు, బిస్కెట్ కలర్ రౌండ్ నెక్ టీ షర్ట్ ఉందని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94410 13330, 0891-2883218 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వరకట్న వేధింపుపై కేసు నమోదు

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులపై రాజాపులోవ గ్రామానికి చెందిన ఎం.మోహన్‌ప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు. రాజాపులోవ గ్రామానికి చెందిన ఎం.మోహనప్రియకు, విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన ఎర్ని వెంకటేష్‌కు 2020లో వివాహం జరిగింది. అప్పట్లో కట్నం అందజేశామని, మళ్లీ ప్రస్తుతం కట్నం తీసుకు రావాలని భర్తతో పాటు మామ, అత్త, ఆడపడుచు వేధిస్తున్నారని మోహన్‌ప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

రేగిడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిశ, జోడబందల సెంటర్ మధ్య మార్గంలో ఆదివారం భారీ ప్రమాదం తప్పింది. వంగర నుంచి రాజాం వైపు వస్తున్న ఊక లారీ, ఎదురు గా వస్తున్న బస్సును తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లింది. అక్కడే విద్యుత్ స్తంభాలు ఉండగా.. డ్రైవర్, క్లీనర్ ఎటువంటి అపాయం లేకుండా బయటపడ్డారు. డ్రైవర్‌కు ఫిట్స్ రావటంతో స్టీరింగ్ పక్కకు తిప్పడంతో ఈ ఘటనకు దారి తీసినట్లు చెబుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగాం, లక్ష్మీపురం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్టు శనివారం రాత్రి రెండు కేసులు నమోదయ్యాయని స్థానిక హెచ్‌సీ తిరుపతిరావు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ లక్ష్మీపురంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్టు ఎం.వేణుగోపాల్, నందిగాంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్టు గురపురెడ్డి కన్నయ్య వేర్వేరుగా ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు కేసులు నమోదు చేశామన్నారు.

లారీ డ్రైవర్లపై కేసు నమోదు

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): భోగాపురం జాతీయ రహదారిపై ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తున్న రెండు ట్రక్ లారీ డ్రైవర్లపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేశామని ఎస్ఐ వి.పాపారావు ఆదివారం తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా అధిక కాంక్రీట్ పిక్కల లోడుతో వెళ్తున్న రెండు ట్రక్ లారీలను పట్టుకుని, కేసులు నమోదు చేశామని చెప్పారు. ఈ లారీల నుంచి రోడ్డుపై రాళ్లపిక్కలు పడడంతో రూ.1600 అపరాధ రుసుం వసూలు చేశామని తెలిపారు.

'జిందాల్' మోసాలపై దర్యాప్తు చేపట్టండి

శృంగవరపుకోట రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ పరిశ్రమ పేరుతో 2008 నుంచి కొందరు దళారీలు నిర్వాసితులను పలు రకాలుగా దోచుకున్నారని, వాటిపై కలెక్టర్ విచారణ చేసి, నిజాలు నిగ్గుతేల్చాలని సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ కోరారు. ఆదివారం బొడ్డవర గ్రామం వద్ద జిందాల్ నిర్వాసితులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు.

ఇసుక అక్రమ నిల్వలు

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): లింగాలవలస సమీప జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే సమీపంలో ఇసుక అక్రమ నిల్వలు దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఇసుకను అక్రమంగా తీసుకొచ్చి, ఇక్కడ డంప్ చేస్తున్నారు. ఇక్కడ నుంచి లారీలతో ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



లింగాలవలస సమీపంలో ఇసుక నిల్వలు

ఎన్నికల హామీల అమలు: ఎమ్మెల్యే

బొబ్బిలి రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి):ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆదివారం మండలంలోని కింతలివానిపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలోభాగంగా ఇంటింటికివెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పింఛన్లు సమయానికి అందజేస్తున్నామని, తల్లికివందనం ఎంతమంది ఉంటే అంత మందికి ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు వానిరెడ్డి సత్యనారాయణ, దిబ్బగుడ్డివలస ఎంపీటీసీ వెన్నెల నాగరాజు, నాయకులు కె.రాము, బొంతలకోటి గోపి, టి.రామారావు, బి.నాగరాజు, యామల గోపి, బి.సింహాచలం, టి.రంగారావు, కృష్ణంరాజు,రామకృష్ణ పాల్గొన్నారు.

●తెర్లాం, జూలై13(ఆంధ్రజ్యోతి):తెర్లాంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ వెంకటనాయుడు,నర్సుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాటరీ సైకిల్ రూపకర్తకు అభినందన

బొబ్బిలి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెర్లాం మండలంలోని జాడవారి కొత్తవలసకు చెందిన రాజాపు సిద్దు ఇటీవల తక్కువ ఖర్చుతో బ్యాటరీ సైకిల్‌ను రూపకల్పన చేయడంతో ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు. ఆదివారం బొబ్బిలి కోటలోని క్యాంప్ కార్యాలయంలో సత్కరించారు.ఆలోచనలకు మరింత పదును పెట్టి, ఉన్నత స్థాయికి వెళ్లాలని బేబీనాయన ప్రశంసించారు.కొంత ఆర్థిక సహాయం చేశారు.వ్యవసాయ ఆధారిత తమ గ్రామంలో చెరువు నీటితో 40 ఎకరాలు రైతులు సాగుచేసుకుంటున్నారని, రెండు బోరు బావులను నిర్మించి సోలార్ ద్వారా విద్యుత్ సదుపాయం కల్పించాలని సిద్దు కోరాడు. అనంతరం సిద్దు సైకిల్‌పై బేబీనాయన కూర్చొని ప్రయాణం చేశారు. కార్యక్రమంలో నేతేటి రామారావు పాల్గొన్నారు.


సిద్దుతో బ్యాటరీ సైకిల్‌పై ఎక్కి ప్రయాణిస్తున్న బేబీనాయన

కాలువలకు నీరు రాక.. వర్షాలు కురవక

● బొబ్బిలి మండలంలో ఎండిపోతున్న వరి నారుమడులు


కోమటిపల్లిలో ఎండిపోతున్న వరి నారు

బొబ్బిలి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోమటిపల్లి, గున్న తోటవలస, ఎం.బూర్జవలస, పిరిడి తదితర గ్రామాల్లో వర్షాలులేక, కాలువ ద్వారా నీరు రాకపోవడంతో నారుమళ్లు, ఎదలు, మొక్కజొన్న పైరు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పది రోజుల కిందట నైరుతి రుతుపవనాల ప్రభావంతో అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు విత్తనాలు చల్లారు. తర్వాత వర్షాలు ముఖం చాటేయడం, పగటిపూట ఉష్ణోగతలు 35 డిగ్రీలు దాటి నమోదవుతుండడంతో మెలిచిన నారు ఎండిపోతోంది. కొన్నిచోట్ల నారుమళ్లు నెర్రలిచ్చాయి. ఈ ఏడాది బొబ్బిలిమండలంలో ఖరీఫ్‌లో 6,850 ఎకరాలు వరిసాగుచేయనున్నట్లు చెబుతున్నారు.ఇందులో 70 వర్షాధార భూముల్లో 30 శాతం వరకూ ఎదలు చల్లారు. వీఆర్ఎస్ కాలువల పరిధిలో ఆయకట్టు రైతులు దమ్ము చేసేందుకు నారు చల్లారు.వీఆర్ఎస్ కాలువల్లో పూడిక తొలగించినా నీరు విడుదలచేయకపోవడంతో నారుమళ్లు తడుపుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. మెట్ట ప్రాంతాల్లో వేసిన మొక్కజొన్న పైరు సైతం ఎండిపోతోంది. తక్షణమే నీరు విడుదలచేసి నారుమళ్లు, ఎదలను రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పూడి వీధిలో సమస్యల తిష్ఠ

బొబ్బిలి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లిలోగల పూడివీధిలో సమస్యలు తిష్ఠవేశాయి. ప్రధానంగా జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటా ఏర్పాటుచేసిన కుళాయిలు నిరుపయోగంగా మారాయి. ఇక్కడ మురుగునీటి కాలువలకోసం తవ్వడంతో పైపులైన్ల ద్వారా నీరందని పరిస్థితి నెలకొంది. దీంతో మహిళలు పక్కవీధుల్లోని వీధి కుళాయిలు, చేతిపంపుల నుంచి నీటిని తీసుకొస్తున్నారు.అలాగే పూడివీధిలోని బోరు పాడై నెలలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడంలేదని మహిళలు వాపోతున్నారు. పూడి వీధిలో పల్లె పండుగలో భాగంగా కాలువలు నిర్మించినా, సీసీ రోడ్డు మాత్రం వేయలేదు. బిల్లులు విడుదల చేయడంలో జాప్యం కావడంతో పనులను నిలిపివేసినట్లు కాంట్రాక్టరు చెబుతున్నారు. కాగా త్వరలో చేతిపంపునకు మరమ్మతులు చేపట్టి నీటి సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. నీటి ప్రవాహంలో ప్రెజర్ లేకపోవడంతో కుళాయిల ద్వారా నీరు రాకపోవచ్చని, పరిశీలించి సరిచేస్తామని చెప్పారు.


కోమటిపల్లిలో నిరుపయోగంగా మారిన కుళాయిలు

గడిగెడ్డ కాలువల్లో పిచ్చిమొక్కలు

● ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

గుర్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఆర్‌పేట, గోషాడ, గూడెం తదితర గ్రామాల్లోని గడిగెడ్డ రిజర్వాయర్ ఎడమ కాలువ పరిధిలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరగడంతో నీరు ముందుకు వెళ్లే అవకాశంలేదని రైతులు చెబుతున్నారు. సమీపంలో కొండవాగుల నుంచి వర్షాకాలంలో గడిగెడ్డ రిజర్వాయర్‌లోకి నీరుచేరుతోంది.ఎడమకాలువ పరిధిలో 1300 ఎకరాలకు నీరందాల్సిఉంది. అయితే కొద్దేళ్లుగా కాలువల నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో ఖరీఫ్‌లో సైతం ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో క్రమేణా రిజర్వాయర్‌లోకి నీరుచేరుతోంది.దీనికితోడు ఎదలు వేయడంతోపాటు నారుపోశారు.ఈ నేపథ్యంలో కాలువల ద్వారా ఖరీఫ్‌లో సాగుకు నీటిని విడుదలచేసినా పిచ్చిమొక్కలు పెరగడంతో ఆయకట్టుకు అందేఅవకాశం ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కనీసం ఉపాధిహామీ పథకం నిధులతోనైనా కాలువల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.


పిచ్చిమొక్కలతో నిండిపోయిన గడిగెడ్డ కాలువ

బిల్లులు కాక.. పనులు సాగక

● నది దాటేందుకు తప్పని అగచాట్లు ● ఇదీ భోజరాజపురం వద్ద వేగావతి నదిపై వంతెన పరిస్థితి


భోజరాజపురం వద్ద వేగావతి నదిపై అర్ధాంతరంగా నిలిచిపోయిన వంతెన నిర్మాణం

బొబ్బిలి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజరాజపురం వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణం బిల్లులు కాకపోవడంతో ముందుకుసాగడం లేదు. ఇక్కడ వంతెన నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 15 కోట్లు మంజురు చేసింది. పనులు ప్రారంభించేలోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీప్రభుత్వం హయాంలో 2020లో పనులకు శంకుస్థాపనచేసి ప్రారంభించారు. ఈనేపథ్యంలో బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టరు పిల్లర్ల స్థాయిలో పనులు నిలిపివేశారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక్కడి వంతెన పనుల్లో కదలిక వచ్చింది. ప్రస్తుతం 40 శాతం మేర పనుల ప్రక్రియ పూర్తయినా చెల్లింపులు నిలిచిపోయాయి. సుమారు మూడు కోట్లు రావల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

నది దాటేందుకు..

భోజరాజపురంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నదిని దాటేందుకు వంతెన లేక అగచాట్లకు గురవుతున్నారు. ఏటా వర్షాకాలంలో రామభద్రపురం మండలంలోని ఇట్లమామిడిపల్లి మీదుగా రామభద్రపురం వచ్చి బొబ్బిలి చేరుకోవాల్సివస్తోంది. అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. మరోవైపు గొర్లెసీతారాంపురం కూడలి నుంచి భోజరాజపురం వెళ్లే రహదారి కూడా పూర్తిగా పాడై గోతులమయమయ్యింది. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. కాగా వంతెనతో పాటు అనుసంధానంగా తారురోడ్డు నిర్మించాల్సి ఉందని జలవనరులశాఖ ఏఈ సుధీర్ తెలిపారు. అలాగే వంతెన నిర్మాణంపై ఉన్నతాధికారులకు నివేదించామని ఆర్అండ్‌బీ ఏఈ నాయుడు తెలిపారు.

స్థలం దొరక్క.. నిర్మాణం జరగక

● ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా త్వరలో పాఠశాల భవనం తొలగింపు

● భవన నిర్మాణానికి రూ.35 లక్షల మంజూరు ● ఇదీ బైరెడ్డిపాలెంలో పరిస్థితి

భోగాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరెడ్డిపాలెంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి స్థలం దొరక్క పనులు చేపట్టడం లేదు. భోగాపురం ఇంటర్నేషనల్ విమానాశ్రయం నిర్మాణంలో భాగంగా ఇక్కడి పాఠశాల భవనం తొలగించనున్నారు. ఈమేరకు రూ.35 లక్షలు కొత్త భవన నిర్మాణానికి మంజూరుచేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్థలాలు దొరక్క అధికారులు తలలు పట్టుకొంటున్నారు.

బైరెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 45 మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడ ప్రస్తుతం విద్యార్థులకు సరిపడే విశాలమైన గదులు, క్రీడా స్థలం ఉంది. ఇంతవరకు అక్కడ ప్రభుత్వ పాఠశాలకు ఎటువంటి ఇబ్బందులు లేదు. దీంతో ఇక్కడ తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకొస్తున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా ఇక్కడ ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం తొలగించనున్నారు. పాఠశాల తొలగించడంతో మళ్లీ భవనం నిర్మాణానికి ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ 35 లక్షలు మంజూరుచేసింది. ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం కావడంతో పాఠశాల భవనం కొద్దిరోజుల్లో తొలగించనున్నారు. దీంతో నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. బైరెడ్డిపాలెం గ్రామ పరిధిలో భవనం నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం దొరక్కపోవడంతో అధికారులు తలలు పట్టుకొంటున్నారు. ఇటీవల జరిగిన మండల సమావేశంలో ఎంఈవోలు రమణమూర్తి, చంద్రమౌళి ఎమ్మెల్యే నాగమాధవి, ఎంపీపీ ఉప్పాడ అనూష దృష్టికి స్థల సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి స్థల సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ రమణమ్మకు సూచించారు. త్వరలో పాఠశాల భవనం తొలగించనుండడంతో స్థలం కేటాయించి భవనం నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా ఆర్అండ్‌బీ రహదారి సమీపంలో కొంత ప్రభుత్వ స్థలం ఉన్నట్లు పరిగణనలోకి వచ్చిందని, దానిని పరిశీలించ డానికి సిబ్బంది వెళ్లారని అయితే ఆ స్థలం ఆక్రమణలో ఉన్నట్లు తెలుస్తుందని ఎంఈవో రమణమూర్తి తెలిపారు. స్థల సమస్యపై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.



తొలగించనున్న బైరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల భవనం ఇదే..

బల్లంకిలో పశువులమ్మ తల్లి పండుగ

వేపాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లంకిలో ఆదివారం పశువులమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. ఏటా వరినాట్లు ప్రారంభమయ్యే సమయంలో ఈపండుగను ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. గ్రామస్థులు డప్పువాయిద్యాలు, బ్యాండు మేళాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి పసుపు కుంకాలు సమర్పించుకోవడంతోపాటు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి గద్దెవద్దకు పాడిపశువులను తీసుకువెళ్లి పశుసంపద చల్లగా ఉండాలని మొక్కుకున్నారు.కార్యక్రమంలో సర్పంచ్ బల్లంకి లక్ష్మి, కనక రాజు, మాజీ సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.


ఆలయం వద్దకు పూజల నిర్వహణకోసం పశువులు తీసుకొచ్చిన గ్రామస్థులు

మొక్కల పంపిణీ

శృంగవరపుకోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రీన్‌ఎర్త్ ఆర్గనైజేషన్ సంస్థ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. కళాశాలల్లో నాటేందుకు మొక్కలను పంపిణీ చేశారు.

యువకుల రక్తదానం

జామి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారాం గ్రామానికి చెందిన 20మంది యువకులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారి కోసం ఆదివారం రక్తదానం చేశారు.ఈ మేరకు తలసేమియ రోగులకోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న న్యూలైఫ్‌బ్లడ్ సెంటర్ డాక్టర్ల బృందం రక్తం సేకరించింది. వారి కోసం భవిష్యత్‌లో మరింతగా రక్తదానం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు యువకులు తెలిపారు. రక్తదానంచేసిన యువకులను గ్రామపెద్దలు అభినందించారు.

మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : బొత్స

విజయనగరం, దాసన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం విజయనగరంలో నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం జరిగింది.ఈసందర్భంగా మాట్లాడుతూ హామీలుఅమలు చేయకుండా మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా అన్నిపథకాలు అమలుచేశామని ప్రకటించడంప్రజలను మోసంచేయడంకాదా అని ప్రశ్నించారు.చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రజలకు ఇచ్చినహామీలు అమలు చేస్తామని ప్రమాణపత్రాలు ఇచ్చి మోసంచేశారన్నారు.అందుకే బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ పేరుతో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి కోలగట్ల వీర భద్రస్వామి, వైసీపీ జిల్లాఅధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీబెల్లాన చంద్రశేఖరరావు, మేయర్ వెంపటాపు విజయలక్ష్మి,అప్పలనాయుడు, పార్టీపరిశీలకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

బొబ్బిలి వీణకు మరో విశిష్ట గుర్తింపు

(ఐదో పేజీ తరువాయి)

నాణాలను ముద్రించింది. బొబ్బిలి వీణకు కేంద్ర ప్రభుత్వం భౌగోళిక గుర్తింపును ఇదివరకే ప్రకటించింది. పలు విశ్వవిద్యాలయాల విద్యార్థులు కూడా వచ్చి ఇక్కడ పరిశోధన చేశారు.

● బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన వీణల తయారీ కేంద్రం ఉంది. వీణల తయారీ ద్వారా సుమారు 300 కుటుంబాల వారు జీవనోపాధి పొందుతున్నారు. బాడంగి మండలం వాడాడ గ్రామంలో కూడా వీణల తయారీ కళాకారులు ఉన్నారు. వారు కూడా బొబ్బిలి వీణలనే తయారు చేస్తుంటారు.

● వీణల తయారీకి పనస చెట్టుకు చెందిన కలపను వాడుతుంటారు. అయితే ఈ పనస కలప సేకరణ పెద్ద సమస్యగా మారింది. విస్తృత స్థాయిలో కలప అందుబాటులో లేదు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం ఆర్థిక భారం. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి వీణల తయారీకి అవసరమైన కలపను ఉత్తరాంధ్ర ప్రాంతంలో విరివిగా పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హర్షణీయం

బొబ్బిలి వీణకు వన్ డిస్ట్రిక్ట్- వన ప్రొడక్టు కింద ఎంపిక కావడం హర్షణీయం. గతంలో భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. దేశవిదేశాల్లో ఎంతోమంది ప్రముఖులను విశేషంగా ఆకట్టుకున్న బొబ్బిలి వీణ తయారీ వెనుక తమ పూర్వీకుల ప్రోద్బలం, కృషి ఉంది. ఈ కళాకారులను ప్రత్యేకించి తంజావూరు పంపించి తమ తాత శిక్షణ ఇప్పించారు. అసెంబ్లీలోనూ కళాకారుల సమస్యలను ప్రస్తావించాను. తాజాగా కేంద్ర ప్రభుత్వం గుర్తించడంతో బొబ్బిలి వీణకు మరింత ప్రాచుర్యం లభిస్తుంది.

-బేబీనాయన, ఎమ్మెల్యే, బొబ్బిలి

కోట శ్రీనివాసరావు మృతితో అభిమానుల దిగ్భ్రాంతి

(ఐదో పేజీ తరువాయి)

సారిక తదితర ప్రాంతాల్లో జరిగింది. ఆ సమయంలో కోట శ్రీనివాసరావు పది రోజుల పాటు విజయనగరంలోనే ఉన్నారు. హోటల్ నుంచి రోజూ షూటింగ్‌కు వెళ్లేవారు. సాయంత్రం లాడ్జికి చేరుకుని ఇక్కడి స్నేహితులతో మాట్లాడేవారు.

తీరని లోటు

సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ అభిమానులకు, కళాకారులకు, సాహితీ ప్రియులకు తీరని లోటు. ఆయన ఎన్నో మంచి చిత్రాల్లో నటించారు. విభిన్నపాత్రలను పోషించి ప్రేక్షకులను రంజింపజేశారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, నటించిన చిత్రాల ద్వారా ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

-కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ

వ్యక్తిత్వం ఎంతో గొప్పది

సినీ నటుడు కోట శ్రీనివాసరావు వ్యక్తిత్వం ఎంతో గొప్పది. 1993లో విజయనగరానికి షూటింగ్ కోసం వచ్చారు. ఇక్కడ పది రోజులు ఉన్నారు. షూటింగ్ పూర్తయిన వెంటనే ఆయన నాటక రంగం గురించి, సాహిత్యం గురించి చర్చించేవారు. విజయనగరం కళల కు, సాహిత్యానికి నిలయమనేవారు. విజయనగరానికి ఎక్కువ సార్లు రావాలని కోరుకునేవారు.

విజ్జపు ప్రసాద్, టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు

గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవే

(ఐదో పేజీ తరువాయి)

నారా చంద్రబాబునాయుడు చేసిన అభ్యర్థనకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించారు. మూలపేట ఓడరేవును విశాఖ జిల్లా భీమిలికి అనుసంధానించే కారిడార్ నిర్మాణానికి వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను రూపొందిస్తున్నట్లు సమాచారం. అయితే నిర్మాణంలో ఉన్న మూలపేట ఓడరేవు, భోగాపురం విమానాశ్రయాలకు మౌలిక సదుపాయాలను అందివ్వడంలో కొత్త రహదారి కీలక పాత్ర పోషించనుంది. అలాగే గ్రామీణ, తీర ప్రాంతాలను అభివృద్ధి చేయనుంది. మత్స్యసంపద ఎగుమతులకు, ఆక్వాకల్చర్, పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధికి మరిన్ని అవకాశాలు రానున్నాయి. డీపీఆర్ ఖరారైన తరువాత రాష్ట్ర ప్రభుత్వం 200 కిలోమీటర్ల విస్తీర్ణంలో భూసేకరణ ప్రక్రియను ప్రారంభించనుంది.

● జిల్లాలో సుమారు 29 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. తీరం వెంబడి భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో 21 గ్రామాలున్నాయి. ఇవన్నీ ఆర్థికంగా అభివృద్ధి చెందనున్నాయి. తీర ప్రాంత మత్స్యకార గ్రామాలనుంచి ఇతర రాష్ట్రాలకు ఇతర ప్రాంతాలకు వలసలు తగ్గే అవకాశం ఉంది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

గజపతినగరం జూలై13: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయనున్నట్లు ఏఎంసీచైర్మన్ గోపాలరాజు తెలిపారు. ఆదివారంగజపతినగరం పంచాయతీ పరిధిలోగల ఎం.వెంకటాపురంలోసుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పథకాలపై అవగాహన కల్పించారు.

●రేగిడి, జూలై 13, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన టీడీపీ ప్రభుత్వం లక్ష్యమని ఇందుకు తొలిఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ఉదాహరణ అని ఎచ్చర్ల నియోజకవర్గం పరిశీలకుడు గురువాన ధనంజయ్ పేర్కొన్నారు.మండలంలో వండానిపేట, పనసలవలస, గోపంపేట, వెంకటపురం, ఖండ్యాంల్లో ఆదివారం టీడీపీసుపరిపాలన, తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడగల నాగరాజు,మంజేటి పురుషోత్తమరావు, నారు శ్రీను, బాబునాయుడు పాల్గొన్నారు.

●రాజాం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చిందని నియోజకవర్గ ఫిషరీస్ అధ్యక్షుడు బెహరా తవుడు పేర్కొన్నారు. మెదరవీధి చెరువు గట్టుపై సుపరిపాలనతొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

చైర్‌పర్సన్‌పై దాడి హేయం

చీపురుపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పల హారికపై దాడి చేయడం హేయమైన చర్య అని చీపురుపల్లి జడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ వల్ల బీసీ మహిళ జిల్లా ప్రథమ పౌరురాలిగా ఎన్నికైతే, ఆమెకిచ్చిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు.

సూపర్‌సిక్స్ పథకాల పేరుతో మోసం

నెల్లిమర్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాల పేరుతో మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. ఆదివారం జరజాపుపేటలో చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, జడ్పీటీసీ గేదెల సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పొంచిఉన్న ప్రమాదం

గుర్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పున్నపురెడ్డిపేటలో జనావాసాల్లో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదంపొంచిఉంది. గ్రామం మధ్యలో ఎటువంటి రక్షణ కంచె ఏర్పాటుచేయకుండా నిర్మించారు. దీనికి తోడు చేతికి అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ సమీపంలో పాఠశాల ఉండడంతో విద్యార్థులు సంచరించే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశముందని తల్లిదండ్రులు భీతిల్లుతున్నారు. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


జనావాసాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్